క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి



అమరావతి: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం స్థానిక షిర్డి సాయి – పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం వేకువజామున సాయిబాబా భక్తులు అమరావతి వీధుల్లో నగర సంకీర్తన గావించారు. కృష్ణా నది జలాలు పంచామృతాలను, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. షిర్డీసాయిబాబా విగ్రహానికి అభిషేకించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. 99 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జాజిబాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ



ముప్పాళ్ళ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శనివారం తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 1,358 మంది ఓటర్లుగా నమోదయ్యారని, ఓటింగ్ ప్రక్రియ గాను ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద జాబితాలు అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలుంటే డిసెంబరు 9 లోపు దరఖాస్తు చేయవచ్చన్నారు. డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్వో రస్కిన్ పాల్గొన్నారు.

ఓటు నమోదుకు స్పెషల్ క్యాంప్‌లు

రాజుపాలెం: మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో) సమక్షంలో స్పెషల్ క్యాంప్‌లు ఆదివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు దుర్గేష్‌రావు శనివారం తెలిపారు. శనివారం నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లో ఓటు నమోదు కోసం ఆన్‌లైన్‌లో 4 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. చేర్పులు, మార్పులకు 10 దరఖాస్తులు వచ్చినట్లు, రాజుపాలెంలో 3, కోట నెమలిపురిలో 2, నెమలిపురిలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు వెల్లడించారు. ఆదివారం కూడా 18 ఏళ్ల నిండిన వారి ఓటు నమోదుకు ప్రత్యేక క్యాంపు నడుస్తుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

56 దరఖాస్తులు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని 274 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌కు 56 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. ఓటు నమోదుకు 22, తొలగింపునకు 18, సవరణకు 16 వచ్చాయన్నారు. ఆదివారం కూడా నియోజకవర్గంలోని 274 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు.

నేడు ఏజీకేఎంలో రెడ్డి వన సమారాధన

సత్తెనపల్లి: కార్తిక మాసం సందర్భంగా పట్టణంలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెడ్డి వన సమారాధన జరుగుతుందని రెడ్డి జన సేవా సమితి బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి సోదర సోదరీమణులు అందరూ కుటుంబ సభ్యులందరితో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఆర్యవైశ్య వన సమారాధన

బెల్లంకొండ: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ఆర్య వైశ్య కార్తిక మాస వన సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎం.సుబ్బారావు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పాపాయపాలెం రోడ్డులో ఉన్న బ్రహ్మంగారి మఠంలో వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యువజన అధ్యక్షుడు అయ్యప్ప స్వామి, ట్రెజరర్ వి.అంకారావు, వైస్ ప్రెసిడెంట్ హనుమంతరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం సత్తెనపల్లిలో జరిగింది. త్రిపురాంతకం నుంచి కృష్ణా జిల్లా నందిగామకు గోపి, భవాని దంపతులు ఇద్దరు పిల్లలతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సత్తెనపల్లి చేరుకోగానే ద్విచక్ర వాహనం చక్రంలో చున్నీ ఇరుక్కోవడంతో.. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న భవాని ఒక్కసారిగా రోడ్డుపై పడింది. ఆమె తల, మెడకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

సాగునీటి సమరానికి సన్నద్ధం

- డిసెంబర్ 5న ఎన్నికల షెడ్యూల్
- రైతుల మధ్య మొదలైన ఎన్నికల కోలాహలం
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం



గుంటూరు బ్రాంచ్ కాలువ

ముప్పాళ్ళ: సాగునీటి సంఘాల ఎన్నికల వేడి మొదలైంది. డిసెంబర్ 5న ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు, 14న ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, ప్రాజెక్టులు పరిధిలోని సర్వే నెంబర్ల ప్రకారం రైతుల జాబితాలను తయారు చేసేలా రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేపట్టి జాబితాలు సిద్ధం చేశారు.

నియోజకవర్గంలో...

నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ళ, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు మండలా పరిధిలో మొత్తం 33 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి 12 మంది టీ.సీ సభ్యులు ఉంటారు. కొన్ని సంఘాలకు ఆరుగురు సభ్యులు ఉన్నారు. సాగునీటి ప్రాజెక్టల పరిధిలోని నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడు దశల్లో ఎన్నిక ప్రక్రియ చేపడతారు. ఒక్కో సాగు నీటి సంఘంలో 12 మంది సభ్యులు ఎన్నుకుంటారు. వీరిని టీసీ మెంబర్లుగా పిలుస్తారు. టీసీ మెంబర్లంతా కలిపి డబ్ల్యూ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. తొలి దశలో సాగు సంఘాలకు, రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు పూర్తి చేస్తారు. మూడో దశలో ప్రాజెక్ట్ కమిటీకి సంబందించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరక్టర్లను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ ఏఏ తేదీల్లో ముగిస్తారనేది నోటిఫికేషన్‌లో వెల్లడిస్తారు.

ఓటరు జాబితాలు సిద్ధం...

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంఘాలకు సంబందించి ఓటర్ల జాబితాలు సిద్ధం చేశారు. ఆయా సంఘాల వారిగా ఓటర్ల జాబితాలను సంబందిత నీటిపారుదలశాఖ అధికారులకు అందించారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 33 సాగునీటి సంఘాలున్నాయి. ముప్పాళ్లలో 6, నకరికల్లు లో 5, రాజుపాలెంలో 9, సత్తెనపల్లి మండల పరిధిలో 13 నీటి సంఘాలున్నాయి. ఆయా సంఘాలకు సంబందించి ఓటర్ల జాబితాలను తయారు చేశారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ విధానం ఉండదు. కేవలం చేతులెత్తి ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులను, అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నాం



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబందించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేశాం. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటర్లను విభజించాం. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం తదుపరి చర్యలు ప్రారంభిస్తాం. వన్ బీ అడంగల్ లో ఉన్న ప్రతి రైతు పేరునూ ఓటరు జాబితాలో చేర్చాం.

–ఎం.భవానిశంకర్, తహసీల్దార్, ముప్పాళ్ళ

నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించాలి

మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య



పురుగు మందులను తనిఖీ చేస్తున్న ఏవో కృష్ణయ్య

బెల్లంకొండ: రైతులకు నాణ్యమైన పురుగు మందుల ఉత్పత్తులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పలు విత్తనాలు, పురుగు మందులు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. విత్తనాల నిల్వలు, పురుగు మందులను పరిశీలించారు. ఉత్పత్తుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన బిల్లులు పరిశీలించి, నాణ్యతా పరీక్షలు కోసం రెండు రకాల విత్తనాలు, పురుగు మందుల నమూనాలు సేకరించినట్లు తెలిపారు. వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, బిల్లుపై రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. గరిష్ఠ చిల్లర ధర మించి అమ్మరాదని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సురక్షిత గ్రామంపై అవగాహన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదకూరపాడు: మండలంలోని గారపాడు గ్రామంలో మై ఛాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో లాంప్ సంస్థ శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్షిత గ్రామంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ల్యాంప్ సంస్థ కో–ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలే సురక్షిత గ్రామాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ ఎస్కే బాజీ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉచితంగా కామిక్ బుక్స్ అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సీహెచ్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్రం



పిడుగురాళ్ల ఎస్టీయూ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్మిక రైతు సంఘాల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు షేక్ హుస్సేన్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, దీనిలో భాగంగానే రైతులకు అన్యాయం చేసే మూడు నల్ల చట్టాలను తీసుకొని వచ్చిందన్నారు. ఈ చట్టాల రద్దు కోసం రైతు, కార్మిక సంఘాలు 13 నెలల పాటు పోరాడి రద్దు చేసుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏ మాత్రం అమలు చేయలేదని, అలాగే వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పీడ్‌గా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నేడు కేవలం నాలుగు వేతన కోడ్‌లను ప్రభుత్వం అమలు చేస్తుందని, దాని ద్వారా కార్మికులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సేవలో మునిగిపోయి రైతు, కార్మిక ప్రయోజనలను తాకట్టు పెట్టిందని వారు విమర్శించారు. ఈ నెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ రేట్ వద్ద జరిగే ధర్నాను రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని ఈసందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు జయ కృష్ణనాయక్, రైతు కూలీ సంఘం నాయకులు నీలాద్రి రాంబాబు, కేఎస్‌పీఎస్ నాయకుడు కృష్ణ, ఎమ్మార్పీస్ నాయకుడు నాగేశ్వరరావు, ఎంఐఎం నాయకుడు ఖాన్, ప్రగతి శీల మహిళా సంఘ నాయకులు పాల్గొన్నారు.

పంటల బీమాపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం నరసరావుపేట వ్యవసాయ అధికారి ప్రవీణ్

రెంటచింతల: పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాల వలన రైతులకు ధీమా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం నరసరావుపేట వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. మంగళవారం సత్రశాల వద్ద డివిజన్ పరిధిలోని రెంటచింతల, గురజాల, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాలలోని వివిధ గ్రామ రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంటల బీమాపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి రైతు సేవాకేంద్రాల సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రతికూల పరిస్థితుల్లోనూ 'అకిరా'తో అధిక దిగుబడి



అధికదిగుబడి సాధించిన రైతుకు సత్కారం

అమరావతి: మండల కేంద్రంతులో శనివారం తులసి సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అకిరా వంగడంపై క్షేత్ర ప్రదర్శన జరిగింది. ఈ క్షేత్ర ప్రదర్శనలో అమరావతి, పెదకూరపాడు మండలాల్లోని 25 గ్రామాల నుంచి 500 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి సీడ్స్ కంపెనీ జోనల్ మేనేజర్ షేక్ మౌలానా రఫీ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ అకిరా వంగడం ప్రతికూల పరిస్థితులను, గులాబీ రంగు పురుగుని సమర్థంగా ఎదుర్కొని, అత్యధిక దిగుబడి ఇచ్చిందన్నారు. రైతు విన్నకోట రాజా మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి అకిరా పత్తి సాగుచేస్తున్నానన్నారు. ఈ ఏడాది కూడా 40 ఎకరాల్లో అకిరా రకం సాగు చేసినట్లు తెలిపారు. అధిక వర్షాలను సైతం తట్టుకుని ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిస్ట్రిబ్యూటర్‌లు మద్దిబాబు, కేశవ, తులసి సీడ్స్ డిప్యూటీ అర్ ఎం వి. చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

3,470 మంది ఓటర్లు



సత్తెనపల్లి: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సత్తెనపల్లి పట్టణ వ్యాప్తంగా 3,470 మంది ఓటర్లు అర్హత సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేపట్టారు. పురుషులు 2,141 మంది, మహిళలు 1,329 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్లు సునీత, రిజ్వానా, బీఎల్వోలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బెల్లంకొండ: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంకొండ ఎస్సై డి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారిని గుర్తించి, ఫైన్ విధించారు. వాహనాలను పరిమిత వేగంతో నడపాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ ముసలారావు, కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

పత్తి వ్యాపారులకు అపరాధ రుసుం



క్రోసూరు: సత్తెనపల్లి తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా తూనిక రాళ్లను తనిఖీ చేసారు. అవతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అపరాధ రుసుం విధించారు. అమరావతి మండలానికి చెందిన వెంకట్రావు, షేక్ జానీ అనే వ్యాపారులు పీసపాడు గ్రామంలో పత్తి కొనుగోలు చేస్తున్నారు. తూనికరాళ్లను ఎలక్ట్రానిక్ కాటాతో సరిపోలగా 16 కిలోల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. సదరు వ్యాపారులకు ఒకరికి రూ.15 వేలు, మరొకరికి రూ.20 వేలు అపరాధ రుసుం విధించారు. మరోసారి పట్టుపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరరావు ఉన్నారు.

తవ్వి వదిలేశారు



క్రోసూరు: జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కొళాయి నీరు అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. క్రోసూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పనులను ఆయన పరిశీలించారు. ఏడాది క్రితం మొదలు పెట్టిన జల జీవన్ మిషన్ పనులు నేటికీ పూర్తి కాలేదన్నారు. పైపులైన్ల కోసం సీసీ రోడ్లు తవ్వి తిరిగి బాగు చేయలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

'పల్లె పండగ' పనుల నాణ్యత తనిఖీ



పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారావు

ముప్పాళ్ళ: పల్లె పండుగలో చేపట్టిన పనులన్నీ డిసెంబర్‌కు చేయాలని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారావు పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైయిన్స్ పనులను శనివారం పరిశీలించారు. పనుల నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తుండాలని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. మండలంలో 25 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయని, ఇందులో 15 పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ప్రభాకర రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ పీ.వీ నారాయణ, ఏపీఓ ఏడుకొండలు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య చలివేంద్రం సంఘ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



చలివేంద్ర సంఘం నూతన కార్యవర్గం

సత్తెనపల్లి: ఆర్యవైశ్య చలివేంద్రం సంఘ అధ్యక్షుడిగా బచ్చు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని శనివారం కన్యకాపరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించారు. గో సంరక్షణ శాల అధ్యక్షుడిగా పెండ్యాల కాశీమల్లేశ్వర రావు ఎన్నికయ్యారు. శ్రీ ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం గౌరవ అధ్యక్షుడిగా సింగరి మధుసూదనరావు, ఉపాధ్యక్షు లుగా ఆత్మకూరి హరనాథ్, అన్నం బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి దోగిపర్తి సత్యనారాయణ, కార్యదర్శులుగా గుండా పూర్ణచంద్రరావు, బాలనాగు శివ కోటేశ్వర రావు, గార్లపాటి నరసింహరావు, నోముల వెంకటరమణ, కోశాధికారిగా కనమర్లపూడి వెంకటసుబ్బారావు, ఉప కోశాధికారి తొమండ్రు సత్యనారాయణ, కార్యనిర్వాహక సభ్యులను ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం, ఆర్యవైశ్య సంఘ నాయకులు జవ్వాజి రామమోహనరావు, ఆతుకూరి నాగేశ్వర రావు, పోతుగంటి రామకోటేశ్వర రావు, దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కల్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్లు అందజేత



నాసా కిట్లు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సత్తెనపల్లి: సైన్స్ ప్రయోగాలతో రాణించి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ నాగార్జున నగర్ బ్రాంచ్ విద్యార్థులు పది మంది నాసా సాయంగా వివిధ రకాల ప్రాజెక్టుల రూపకల్పనకు అర్హత సాధించారు. నాసా పంపిన కిట్స్‌ను డాక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం అందజేశారు. నాసా ప్రాజెక్టులతో పాటు ఇంకా ఎన్నెన్నో మంచి ప్రయోగాలు చేయాల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ ఏజీఎం డాక్టర్ అంజయ్య, రీజినల్ ఇన్‌చార్జి అప్పాజీ, అకాడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ విశ్వనాథ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పరదా పట్టలే.. కాలువకు లాకులు...!



నాగిరెడ్డిపాలెం వద్ద కాలువకు పట్టలు, కర్రలు అడ్డుపెట్టిన ఇరిగేషన్ అధికారులు



పరదా పట్టలతో నిలిచిపోయిన కాల్వలో నీరు

బెల్లంకొండ: నాగిరెడ్డి పాలెంలోని బెల్లంకొండ – ఎర్రబ్రాలెం మేజర్ కాలువ నీటి ప్రవాహాన్ని నిలిపేందుకు పరదా పట్టలు, చెట్ల కర్రలే లాకులుగా మారాయి. నంది రాజుపాలెం నుంచి నాగిరెడ్డి పాలెం వచ్చే దారిలో కాలువపై పరదా పట్టలను అడ్డుపెట్టి నీటిని నిలుపి వేస్తున్నారు. మేజర్ కాలువల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొద్ది రోజులుగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కాలువపై పట్టలతో నీటిని నిలిపిన విధానం ఇరిగేషన్ అధికారుల పనితీరుకు దీనికి అద్దం పడుతోంది. రెండు రోజులుగా కాలువపై నాచు తొలగించేందుకు ఈ పరదా పట్టలను, కర్రలను అడ్డుపెట్టి నీటిని నిలిపి వేశారు. గతవారం కాలువ నీటి ఉధ్రుతికి, వర్షం నీరు తోడవడంతో కాలువ కట్ట తెగి వరి పంటలపై విరుచుకుపడింది. కాలుపై లాకులు లేకపోవడంతోనే గండి పడి పంటలు నష్టపోయామని రైతులు చెప్తున్నారు. కాల్వ పై లాకులు ఏర్పాటు చేయకుండా పట్టలను కర్రలను అడ్డుపెట్టడం చూసి రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలుపై లాకును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

దాతల సహకారం అభినందనీయం

దాచేపల్లి: దాతల సహకారం మరువలేనిదని సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య అన్నారు. మండలంలోని పెదగార్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు వీఎంఎన్‌వీ పౌండేషన్ ఆధ్వర్యంలో రూ50వేలు విలువ చేసే ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు, అట్లాస్ పుస్తకాలను శనివారం అందించారు. విద్యార్థులు దాతల సహకారంతో ఉన్నతమైన చదువులు చదువుకోవాలని సర్పంచ్ వెంకటకోటయ్య చెప్పారు. పౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మామిళ్ల నవీన్ మాట్లాడుతూ తమ పౌండేషన్ ద్వారా సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఇంటర్మీడియట్ చదువుకునే నిరుపేదలైన 13మంది విద్యార్థులకు కళాశాల ఫీజుల కోసం ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ1.95లక్షల నగదుని ఫౌండేషన్ ద్వారా నవీన్ అందజేశారు. విద్యార్థులకు అండగా నిలిచిన ఫౌండేషన్ చైర్మన్ నవీన్‌ని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మామిళ్ల నవీన్, హెచ్‌ఎం బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యం చెన్నారెడ్డి, తోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల: ఇంటి పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తమ వంతు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ... పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేసి, చెత్త నిల్వ లేకుండా తొలగించాలన్నారు. అలాగే పట్టణంలోని నివాస ప్రాంతాలలో కూడా స్థానికులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఈ సందర్భంగా సూచించారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే ఆరోగ్య పరిరక్షణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.